గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిఎం

గవర్నర్‌తో సిఎం రేవంత్ భేటీ

- ఆర్‌టిఐ కమిషనర్ల ఫైల్ క్లియర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. సోమవారం ఉదయం మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి రాజభవన్‌కు వచ్చిన సిఎం...అరగంటకు పైగా సమావేశమయ్యారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు,సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై చర్చించారు.రాజ్‌భవన్‌లో పెండింగ్‌లో ఉన్న సమాచార హక్కుచట్టం (ఆర్‌టిఐ) కమిషనర్ల ఫైల్‌ను సిఎం ఈ సందర్భంగా ప్రస్తావించారు. సిఎం రాజ్‌భవన్ నుంచి వెళ్లిపోయిన కొద్దిసేపటికే ఆర్టిఐ కమిషనర్ల ఫైల్‌పై గవర్నర్ సంతకం చేశారు. సీనియర్ జర్నలిస్టు పీవీ శ్రీనివాసరావు, సీనియర్ అడ్వకేట్లు మొహసినా పర్వీన్, దేశాల భూపాల్, సిఎం సిపిఆర్‌ఓ బోరెడ్డి అయోధ్యరెడ్డిని నియమిస్తూ నలుగురిని నియమిస్తూ సిఎస్ రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు.

నర్సులకు సిఎం రేవంత్ రెడ్డి అభినందనలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా నర్సులందరికీ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి హదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ మేరకు సోమవారం సిఎం కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. అచంచలమైన నిబద్ధతతో ప్రజారోగ్య సంరక్షణలో అసమాన సేవలు వారు అందిస్తున్నారని సీఎం కొనియాడారు. ప్రతిఫలం ఆశించకుండా అవిశ్రాంతంగా నర్సులు అందించే సేవలు అద్వితీయమని ఆయన ప్రశంసించారు.

ఫార్మసిస్ట్ పరీక్షా ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో 732 ఫార్మసిస్ట్ పోస్టుల భర్తీకి సంబంధించిన పరీక్షా ఫలితాలను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రీక్రూట్‌మెంట్ బోర్డు సోమవారం విడుదల చేసింది. ఈ మేరకు బోర్డు సభ్య కార్యదర్శి ఒక ప్రకటన విడుదల చేశారు. గతేడాది నవంబర్ 30న ఫార్మసిస్ట్ గ్రేడ్ 2 పోస్టుల భర్తీకి పరీక్ష నిర్వహించారు. పరీక్షల కోసం మొత్తం 27,101 మంది దరఖాస్తు చేసుకోగా, 24,578 మంది పరీక్షకు హాజరైన సంగతి తెలిసిందే. కాగా డిసెంబర్ 12న ప్రిలిమినరీ కీ విడుదల చేశారు. తాజాగా అభ్యర్థులు సాధించిన మార్కుల వివరాలను బోర్డు వెబ్‌సైట్ https:// mhsrb. telangana.gov.in/MHSRB/home.htmలో అందుబాటులో ఉంచారు. అభ్యర్థులు తమ మార్కుల వివరాలను చెక్ చేసుకోవాలని బోర్డు సూచించింది. త్వరలోనే ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్ విడుదల చేస్తామని బోర్డు ఆ ప్రకటనలో తెలియజేసింది.

ఈసెట్ పరీక్షకు 96.22 శాతం హాజరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో బిటెక్, బిఇ, బి ఫార్మసీ, బిఎస్సీ మ్యాథమెటిక్స్ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ద్వితీయ సంవత్సరంలో లాటరల్ ఎంట్రీ ద్వారా ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఇ సెట్ రాతపరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ మేరకు ఈసెట్ కన్వీనర్ పి చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్ పరిధిలో 46, ఇతర జిల్లాల్లో 40 కలిపి మొత్తం 86 పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించామని తెలిపారు. ఇ సెట్‌కు రాష్ట్రవ్యాప్తంగా 19,672 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, రికార్డుస్థాయిలో 18,928 (96.22 శాతం) మంది హాజరయ్యారని వివరించారు. 744 (3.78 శాతం) మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. ప్రశ్నాపత్రం పాస్‌వర్డ్‌ను ఉన్నత విద్యామండలి చైర్మన్ వి బాలకిష్టారెడ్డి, ఒయు విసి, ఇ సెట్ చైర్మన్ ఎం కుమార్ విడుదల చేశారని తెలిపారు. ఓయూలోని పరీక్షా కేంద్రాన్ని వారు సందర్శించి పరిశీలించారని పేర్కొన్నారు.

నేడే పాలిసెట్ పరీక్ష

- 1,06,716 మంది దరఖాస్తు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పాలిటెక్నిక్, డిప్లొమా, వ్యవసాయ, ఉద్యానవన, వెటర్నరీ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించే పాలిసెట్-2025 రాతపరీక్ష మంగళవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరగనుంది. పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎంపీసీ నుంచి 64,295 మంది, బైపీసీ నుంచి 42,421 మంది కలిపి మొత్తం 1,06,716 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. వారికోసం రాష్ట్రంలో 276 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. అభ్యర్థులు గంట ముందునుంచే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. పరీక్ష ప్రారంభమైన తర్వాత నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులను అనుమతించబోరు. హాల్‌టికెట్‌తో పాటు హెచ్‌బీ పెన్సిల్, ఎరేసర్, బ్లూ, బ్లాక్ బాల్ పాయింట్ పెన్ను తప్పకుండా తీసుకుని రావాలని అధికారులు సూచించారు. హాల్‌టికెట్ మీద ఫొటో ముద్రించని వారు పాస్‌పోర్టు సైజ్ ఫొటోతోపాటు ఆధార్ కార్డు (గుర్తింపు కార్డు) వెంట తెచ్చుకోవాలని కోరారు. పరీక్షా కేంద్రంలోకి సెల్‌ఫోన్ ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి ఉండదు.

జిసిసి హబ్‌గా హైదరాబాద్

- ఎఐ-రెడీ డేటా సెంటర్లు, తయారీ రంగాలకు ఇది కేంద్రం
- అందుకే హైదరాబాద్ బ్రాండ్ అంబాసిడర్లుగా మారండి
- పారిశ్రామికవేత్తలకు సిఎం రేవంత్ పిలుపు
- సొనాటా సాఫ్ట్‌వేర్ కొత్త ఫెసిలిటీ సెంటర్ ప్రారంభం

సొనాటా సాఫ్ట్‌వేర్ కొత్త ఫెసిలిటీ సెంటర్ ప్రారంభిస్తున్న సిఎం రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ మహానగరం సాఫ్ట్‌వేర్, లైఫ్ సైన్సెస్‌తోపాటు ఇంకా అనేక రంగాల్లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జిసిసి)కు హబ్‌గా మారిందని ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి తెలిపారు. అలాగే ఎఐ-రెడీ డేటా సెంటర్లు, తయారీ రంగాలకు ఇది కేంద్రంగా మారిందని ఆయన చెప్పారు. అందువల్ల హైదరాబాద్‌కు బ్రాండ్ అంబాసిడర్లుగా మారండి, ఘన విజయాలను సొంతం చేసుకోండంటూ పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. సోమవారం హైదరాబాద్‌లోని నానక్‌రామ్‌గూడలో సొనాటా సాఫ్ట్‌వేర్ సంస్థ కొత్త ఫెసిలిటీ సెంటర్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సొనాటా సాఫ్ట్‌వేర్ అత్యాధునిక ఏఐని ఉపయోగించి పర్యావరణ వ్యవస్థలను రూపొందించడం గర్వకారణమని ప్రశంసించారు. హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్, కాగ్నిజెంట్, హెచ్‌సిఎల్ టెక్, ఇన్ఫోసిస్, విప్రో వంటి ఐటీ దిగ్గజాలు తమ క్యాంపస్‌లను విస్తరిస్తున్నాయని తెలిపారు. ఈ క్రమంలో తమ ప్రభుత్వం రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, సీనియర్ సిటిజన్ల సంక్షేమం కోసం పనిచేస్తూనే పరిశ్రమలకు మద్దతునిస్తూ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతోందని వివరించారు. డిసెంబర్ 2023 నుంచి ఇప్పటివరకు రాష్ట్రానికి కొత్తగా రూ. మూడు లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం లక్షకు పైగా ఉద్యోగాలను సృష్టించిందని చెప్పారు. ఈ యేడాది దావోస్‌లో జరిగిన ఒప్పందాల ప్రకారం మన రాష్ట్రం రూ. 1.78 లక్షల కోట్ల పెట్టుబడులను రాబట్టి నంబర్‌వన్‌గా నిలిచిందని వివరించారు. ఈ రకంగా దేశీయంగా, అంతర్జాతీయంగా పెట్టుబడుల ఆకర్షణలో అగ్రస్థానంలో ఉన్నామని తెలిపారు. దీంతోపాటు పోలీసింగ్, శాంతిభద్రతలు, ద్రవ్యోల్బణ నిర్వహణ, ఉద్యోగాల సృష్టి, పన్ను వసూళ్లలో కూడా తెలంగాణ మొదటి స్థానంలో కొనసాగుతోందని విశ్లేషించారు. రాష్ట్రంలోని 66 లక్షల మహిళలకు స్వయం సహాయక బృందాల ద్వారా సాధికారత లభించిందని అన్నారు. రాజీవ్ యువ వికాసం ద్వారా ప్రభుత్వం యువతకు వ్యాపార అవకాశాలను కల్పిస్తోందని చెప్పారు. స్వయం ఉపాధికి అవసరమైన నిధులను ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. హైదరాబాద్ ట్రాఫిక్ ఫోర్స్‌లో ట్రాన్స్‌జెండర్ స్వచ్ఛంద సేవకులను నియమించిన మొదటి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని గుర్తుచేశారు. డ్రై పోర్టు నిర్మాణం, ఆంధ్రప్రదేశ్ సముద్ర ఓడరేవుతో అనుసంధానం, ఫ్యూచర్ సిటీలో ఏఐ నగరం, యంగ్ ఇండియా స్కిల్స్, స్పోర్ట్స్ యూనివర్సిటీలు, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం కొనసాగుతున్నాయని వివరించారు. ప్రపంచంలోనే గొప్ప ఈవెంట్లలో ఒకటిగా పేరుపొందిన మిస్ వరల్డ్ పోటీలు హైదరాబాద్‌లో జరుగుతున్నాయని గుర్తు చేశారు. భవిష్యత్తులో మరిన్ని ప్రపంచ ఈవెంట్ల నిర్వహణకు తమ ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందని వెల్లడించారు. తెలంగాణ రైజింగ్ కార్యాచరణ ద్వారా ఆర్థికాభివృద్ధి, పెట్టుబడులు, ఉద్యోగాలు, మౌలిక సదుపాయాలు, సంక్షేమం సమతుల్యంగా సాగుతున్నాయని సిఎం వ్యాఖ్యానించారు. ఒక ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా ఎదగడంలో, హైదరాబాద్‌ను అత్యద్భుత నగరంగా తీర్చిదిద్దటంలో ప్రభుత్వానికి సహకారం అందించాలంటూ ఆయన ఈ సందర్భంగా పారిశ్రామికవేత్తలను కోరారు. కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

15న 'పుష్కరాలు'... హాజరు కానున్న సిఎం

- కాళేశ్వరంలో అంగరంగ వైభవంగా ఏర్పాట్లు
- జయశంకర్-భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ

కాళేశ్వరంలో పుష్కరాల పనులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈ నెల 15న అట్టహాసంగా సరస్వతీ నది పుష్కరాలు ప్రారంభం కానున్నాయని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరై పుష్కరాలు ప్రారంభిస్తారని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. సోమవారం జయశంకర్-భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో పుష్కరాల పనులను జిల్లా ఎస్‌పి కిరణ్ ఖరేతో కలిసి పరిశీలించారు. సిఎం రాక సందర్భంగా ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... దక్షిణాది రాష్ట్రాల్లో ఏకైక త్రివేణి సంగమం, దేశంలో రెండో ప్రాంతం అయిన కాళేశ్వర క్షేత్రం అద్భుతమైన ఘట్టానికి వేదిక కాబోతోందన్నారు. సరస్వతీ నది అంతర్వాహినిగా ప్రవహించే త్రివేణి సంగమం అయిన కాళేశ్వరంలో అంగరంగ వైభవంగా పుష్కరాలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందన్నారు. ప్రతిరోజూ కాశీ పీఠాధిపతిపతులచే నది హారతి కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఇప్పటికే ప్రముఖులు, భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ 15వ తేదీన సరస్వతీ మాత విగ్రహంను సిఎం ఆవిష్కరించడంతో పాటు గోదావరి హారతి, త్రిలింగ క్షేత్రమైన శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారని తెలిపారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నట్టు తెలిపారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో సందర్శకులు వస్తారని అందుకనుగుణంగా సకల సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పనులు సకాలంలో పూర్తి చేయించేందుకు ప్రత్యేక అధికారులను నియమించి పర్యవేక్షణ చేస్తున్నామని తెలిపారు. పుష్కరాలు నిర్వహించనున్న 12 రోజుల పాటు ప్రజలకు సేవలందించేందుకు ప్రభుత్వ యంత్రాంగం అందుబాటులో ఉండేలా ప్రణాళికలు చేసినట్టు చెప్పారు. జిల్లా ఎస్‌పి కిరణ్ ఖరే పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

ప్రతి పేదవాడికీ మెరుగైన వైద్యం

- ప్రజలకు ఆత్మస్థైర్యాన్ని కల్పించే విధంగా వైద్య సేవలు
- త్వరలో మరిన్ని ఖాళీల భర్తీ
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

ఆస్పత్రిని ప్రారంభిస్తున్న మంత్రి దామోదర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రతి పేదవాడికీ మెరుగైన వైద్యం అందిస్తామని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ప్రజలకు ఆత్మస్థైర్యాన్ని కల్పించే విధంగా వైద్య సేవలు ఉండాలని అధికారులకు మంత్రి సూచించారు. సోమవారం వికారాబాద్ జిల్లాలో మంత్రి పర్యటించారు. పరిగి పట్టణ కేంద్రంలో రూ.27 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 100 పడకల ప్రాంతీయ ఆస్పత్రి పనులకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, ఎంపి కొండ విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు టి. రామ్మోహన్‌రెడ్డి, బి.మనోహర్‌రెడ్డి, ఆర్యవైశ్య ఫెడరేషన్ చైర్ పర్సన్ కాల్వ సుజాతతో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. అలాగే, వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని రాజీవ్ నగర్ కాలనీ సమీపంలో రూ.30 కోట్లతో నిర్మించిన 300 పడకల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని మంత్రి ప్రారంభించారు. అనంతరం కలెక్టరేట్‌లో ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులతో కలిసి ప్రభుత్వ ఆస్పత్రుల, వైద్య కళాశాల నిర్వహణ, మౌలిక సదుపాయాలు, బ్లడ్ బ్యాంక్, వైద్యుల విధుల నిర్వహణ తదితర అంశాలపై మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అన్ని రకాల స్పెషాలిటీ వైద్య సేవలు ఇక్కడ అందుబాటులోకి తెస్తామన్నారు. డయాలసిస్ సెంటర్‌లో బెడ్లు, మిషన్ల సంఖ్యను పెంచి కిడ్నీ పేషెంట్లను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. రోడ్డు ప్రమాదాలు, ఇతర అత్యవసర సమయాల్లో ప్రజల ప్రాణాలు కాపాడేలా అత్యాధునిక వసతులతో ట్రామా కేర్ సెంటర్లు అభివృద్ధి చేస్తామన్నారు. అంబులెన్స్‌ల సంఖ్యను పెంచి, అత్యవసర సేవలను అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఇటీవలే 213 కొత్త అంబులెన్స్‌లను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారని గుర్తు చేశారు. రాష్ట్రంలో గతేడాది 16 కొత్త నర్సింగ్ కాలేజీలను ప్రారంభించుకున్నామన్నారు. గతేడాది 6,956 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేశామని, మరో 2,300ల పైచిలుకు పోస్టుల భర్తీ ప్రక్రియ నెల రోజుల్లో పూర్తవుతుందని తెలిపారు. ప్రభుత్వ హాస్పిటళ్ల రూపు రేఖలను మార్చడానికి బ్రాండింగ్ కార్యక్రమాన్ని చేపట్టామని, ఈ కార్యక్రమం ద్వారా మరింత ఆకర్షణీయంగా, ఆహ్లాదకరంగా ఆస్పత్రులను అభివృద్ధి చేసి, పేషెంట్లకు మరింత మెరుగైన వైద్య సేవలు అందిస్తామని అన్నారు. ఆస్పత్రుల్లో మందుల కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ, సూపరింటెండెంట్‌లు జవాబుదారీతనంతో ఉండాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వేతర ఆస్పత్రులను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కుల గణన సర్వే నిర్వహించి 75 అంశాలతో కూడిన సమాచారాన్ని సేకరించినట్టు తెలిపారు. కులాలకు అతీతంగా సామాజిక న్యాయం జరగాలనే నేపథ్యంలో ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీలో ఆమోదం తెలిపినట్టు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్, డీఎంఈ డాక్టర్ నరేంద్రకుమార్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ అజయ్ కుమార్, జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి, డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ, డీసీహెచ్‌ఓ ఆనంద్, గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రాజేశ్వర్‌రెడ్డి, ఆర్డీవో వాసుచంద్ర తదితరులు పాల్గొన్నారు.

'మోడల్' ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో 2025-26 విద్యాసంవత్సరంలో ఆరో తరగతి ప్రవేశాలతోపాటు ఏడు నుంచి పదో తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ప్రవేశ పరీక్ష ఫలితాలను సోమవారం ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు మోడల్ స్కూళ్ల అదనపు సంచాలకులు ఎస్ శ్రీనివాసాచారి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 27వ తేదీన ప్రవేశ పరీక్షను నిర్వహించామని తెలిపారు. ప్రవేశ పరీక్షకు సంబంధించిన మార్కులు, ర్యాంకులను విడుదల చేశామని పేర్కొన్నారు. ఆరో తరగతిలో ప్రవేశాల కోసం 23,944 మంది దరఖాస్తు చేయగా, 18,501 (77.27 శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారని వివరించారు. 5,443 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. పరీక్షకు హాజరైన వారిలో 9,603 (51.91 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ఏడో తరగతిలో ప్రవేశాల కోసం 6,793 మంది దరఖాస్తు చేస్తే 5,249 (77.27 శాతం) మంది పరీక్ష రాశారని పేర్కొన్నారు. వారిలో 2,214 (42.18 శాతం) మంది పాసయ్యారని వివరించారు. ఎనిమిదో తరగతిలో ప్రవేశాల కోసం 5,249 మంది దరఖాస్తు చేయగా, 4,011 (76.41 శాతం) మంది హాజరయ్యారని తెలిపారు. వారిలో 1,448 (36.10 శాతం) మంది అర్హత సాధించారని పేర్కొన్నారు. తొమ్మిదో తరగతిలో ప్రవేశాల కోసం 3,437 మంది దరఖాస్తు చేస్తే 2,521 (73.35 శాతం) మంది పరీక్ష రాశారని వివరించారు. వారిలో 993 (39.39 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. పదో తరగతిలో ప్రవేశాల కోసం 908 మంది దరఖాస్తు చేయగా, 602 (66.30 శాతం) మంది పరీక్షకు హాజరయ్యారని పేర్కొన్నారు. వారిలో 215 (35.71 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షకు 40,331 మంది దరఖాస్తు చేయగా, 30,884 (76.58 శాతం) మంది విద్యార్థులు పరీక్ష రాశారని పేర్కొన్నారు. 9,447 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. పరీక్షకు హాజరైన వారిలో 14,473 (46.86 శాతం) మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని వివరించారు. ప్రవేశాల ప్రక్రియ దరఖాస్తు చేసిన మోడల్ స్కూళ్లలోనే జరుగుతుందని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం http:// telanganams. cgg.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

కరాచీ బేకరీపై అరాచక శక్తుల దాడికి సిపిఎం ఖండన

- నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి : జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లోని కరాచీ బేకరీపై మతోన్మాద అరాచక శక్తులు దాడి చేయడాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశం మీద ఉగ్రవాద దాడికి వ్యతిరేకంగా కుల, మతాలకు అతీతంగా ప్రజలంతా ఐక్యంగా సైన్యానికి మద్దతుగా నిలబడ్డారని తెలిపారు. ఈ సందర్భంలో ఇలాంటి చర్యలు అనైక్యతకు దారితీస్తాయని పేర్కొన్నారు. దేశ విభజన సందర్భంగా పాకిస్తాన్ కరాచీ నుంచి వచ్చినటువంటి హిందువుల కుటుంబం ఆ పేరుతో ఏండ్ల తరబడి దేశవ్యాప్తంగా బేకరీలను నడిపిస్తున్నదని గుర్తు చేశారు. మతోన్మాదులు పాకిస్తాన్ నగరం పేరు ఉండకూడదంటూ ఈ అరాచకానికి పాల్పడటం శోచనీయమని విమర్శించారు. ఇలాంటి చర్యలకు అవకాశం ఇవ్వకుండా నిందితులపై ప్రభుత్వం, పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాజ్‌భవన్ స్కూల్ టెన్త్ విద్యార్థులను సన్మానించిన గవర్నర్

- రికార్డు స్థాయిలో 97 శాతం ఉత్తీర్ణత నమోదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజ్‌భవన్ పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సన్మానించారు. సోమవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో ఉత్తమ మార్కులు పొందిన విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులతో ఆయన సమావేశమయ్యారు. ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో రాజ్‌భవన్ పాఠశాల రికార్డుస్థాయిలో 97 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఆ పాఠశాలకు చెందిన హాసిని 574 మార్కులతో హైదరాబాద్ జిల్లా టాపర్‌గా నిలిచారు. ఆమెతోపాటు 500 మార్కులకుపైగా సాధించిన మరో 20 మంది విద్యార్థులను గవర్నర్ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతిలో ఉత్తమ ఫలితాలను సాధించేందుకు అంకితభావంతో కృషి చేసిన ఉపాధ్యాయులు, ఇతర సిబ్బందిని అభినందించారు. ఆ విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ముఖ్యకార్యదర్శి ఎం దానకిశోర్‌తోపాటు రాజ్‌భవన్ పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి ఉపాధ్యాయులకు శిక్షణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, తెలంగాణ గురుకులాలు, కెజిబివిలు, మోడల్ స్కూళ్లు, యూఆర్ఎస్, ఐఈఆర్‌పిల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మంగళవారం నుంచి శిక్షణా కార్యక్రమం ప్రారంభం కానుంది. రెండు విడతల్లో ఈ శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తారు. మంగళవారం నుంచి ఈనెల 17వ తేదీ వరకు మొదటి విడత, ఈనెల 20 నుంచి 24వ తేదీ వరకు రెండో విడత జరుగుతుంది. ఒక్కో విడతలోని ఉపాధ్యాయులకు ఐదురోజులపాటు శిక్షణ ఉంటుంది. ఎంఆర్పీలు, స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలు, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు, టిజిటి, పిజిటితో పాటు సిఆర్‌టిలకు శిక్షణను నిర్వహిస్తారు. జులై నాటికి ఉద్యోగ విరమణ పొందే ఉపాధ్యాయులకు ఈ శిక్షణ నుంచి పాఠశాల విద్యాశాఖ మినహాయింపునిచ్చింది. ఉపాధ్యాయులకు ముందస్తు సమాచారం అందించి వంద శాతం హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎంలకు ప్రత్యేక శిక్షణ ఉండబోదని స్పష్టం చేశారు.

జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు కౌన్సిలింగ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గిరిజన గురుకుల జూనియర్ కళాశాలల్లో ప్రశేశాలకు కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్టు హైదరాబాద్, రంగారెడ్డి రీజియన్ కో ఆర్డినేటర్ కె నాగార్జున సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో గిరిజన గురుకుల జూనియర్ కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటర్ ఫస్ట్ ఇయర్ ప్రవేశాలకు సంబంధించి బులురకు ఈనెల 15న, బాలికలకు 16న కౌన్సిలింగ్‌ను నిర్వహించనున్నట్టు తెలిపారు. కౌన్సిలింగ్‌కు హాజరయ్యే విద్యార్థిని, విద్యార్థులు బదిలీ ధృవీకరణ పత్రం, పదోతరగతిలో సాధించిన మార్కుల మెమో, స్టడీ కండక్ట్, కుల ధృవీకరణ, 2024-25 ఆదాయ ధృవీకరణ పత్రాలను తీసుకురావాలని సూచించారు. వారి తల్లిదండ్రులకు ఆదాయ పరిమితి గ్రామీణ ప్రాంతమైతే రూ. 1.5లక్షలు, పట్టణ ప్రాంతంలో రూ. 2. లక్షలు, మించరాదని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9502050715, 9603431550, 9014447896 సంప్రదించాలని సూచించారు.

రూ. 53 లక్షల గంజాయి పట్టివేత

- ఒడిశా నుంచి హైదరాబాద్‌కు అక్రమ రవాణా
- ఎక్సైజ్ అడిషనల్ కమిషనర్ యాసిన్ ఖురేషి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఎక్సైజ్ శాఖ గంజాయి అక్రమార్కులపై ఉక్కుపాదం మోపింది. హైదరాబాద్‌లోని ఉప్పల్ హెచ్‌సీఎల్ ప్రాంతంలోని ఓ గోదాంలో అక్రమంగా నిల్వ ఉంచిన 106 కిలోల గంజాయిని అధికారులు పట్టుకున్నారు. ఈ మేరకు సోమవారం నాంపల్లిలోని అబ్కారీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆశాఖ అదనపు కమిషనర్ సయ్యద్ యాసిన్ ఖురేషి వివరాలు వెల్లడించారు. గోప్యమైన సమాచారం ఆధారంగా డీటీఎఫ్, ఉప్పల్ ఎక్సైజ్ పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించారని తెలిపారు. మల్లాపూర్ ఎచ్‌సీఎల్ ఉప్రాంతంలోని ఓ పాడుబడిన గోదాం వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా, ఒడిశా నుంచి కారులో హైదరాబాద్‌కు అక్రమంగా గంజాయి తరలించారని వెల్లడించారు. వారిచ్చిన సమాచారం మేరకు గోదాంలో తనిఖీ చేయగా, 2 కిలోల చొప్పున 56 ప్యాకెట్లు, 1 కిలో చొప్పున 6 ప్యాకెట్ల గంజాయి స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. పట్టుకున్న గంజాయి విలువ మార్కెట్ రేట్ ప్రకారం రూ.53 లక్షలని తెలిపారు. కేసులో ఏ1గా ఒడిశాలోని మల్కాన్‌గిరి జిల్లాకు చెందిన రాంబాబు, ఏ 2గా ఘట్‌కేసర్‌కు చెందిన కట్ల వివేక్ రెడ్డిలను ఆదుపులోకి తీసుకున్నామనీ, మూడో నిందితుడుగా ఉన్న దగ్గుమల్లి మధుకిరణ్ పరారీలో ఉన్నట్టు తెలిపారు. స్పెషల్ డ్రైవ్ లో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎస్టీఎఫ్, డీటీఎఫ్ టీమ్‌లతోపాటు స్థానికంగా ఎక్సైజ్ శాఖ అధికారులు డ్రగ్స్ పై ప్రత్యేకంగా దాడులు నిర్వహిస్తున్నారని ఖురేషి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి డిప్యూటీ కమిషనర్ పి.దశరథ్ మల్కాజిగిరి ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్ కుమార్, ఏఈఎస్ ముకుందరెడ్డి, ఉప్పల్ ఎస్‌హెచ్‌ఓబీ. ఓంకార్, డీటీఎఫ్ సీఐ భరత్ భూషన్, ఎస్సైలు నరేశ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

ZAGGLE PREPAID OCEAN SERVICES LIMITED
CIN: L65999TG2011PLC074795
Regd Off: 15th Floor,Western Block, Vamsiram - Suvarna Durga Tech Park, Nanakramguda Village, Serilingampally Mandal, GHMC Serilingampally Circle, , Ranga Reddy, Telangana, 500032.
email id: accounts.hyd@zaggle.in

31 మార్చ్, 2025తో ముగిసిన త్రైమాసికం మరియు సంవత్సరం కొరకు జాగిల్ ప్రీపెయిడ్ ఓషన్ సర్వీసెస్ లిమిటెడ్ (కంపెనీ) యొక్క స్టాండ్‌అలోన్ మరియు కన్సాలిడేటెడ్ ఆడిట్‌చేసిన ఆర్థిక ఫలితాలు

31 మార్చ్, 2025తో ముగిసిన త్రైమాసికం మరియు సంవత్సరానికి స్టాండ్‌అలోన్ మరియు కన్సాలిడేటెడ్ ఆడిట్‌చేసిన ఆర్థిక ఫలితాలు 12 మే, 2025న నిర్వహించిన వారి సమావేశంలో కంపెనీ యొక్క బోర్డు ఆఫ్ డైరెక్టర్లు ఆమోదించారు.

కంపెనీ యొక్క చట్టబద్ధమైన ఆడిటర్లచే జారీచేసిన ఆడిట్ రిపోర్టులతోపాటుగా పై పేర్కొన్న ఆర్థిక ఫలితాలు కంపెనీ యొక్క వెబ్‌సైట్: https://ir.zaggle.in/financials/లో అందుబాటులో ఉన్నాయి మరియు దిగువ ఇచ్చిన క్విక్ రెస్పాన్స్ (క్యూఆర్) కోడ్ స్కానింగ్ చేయుట ద్వారా కూడా పొందవచ్చును.

ప్రదేశం: హైదరాబాద్
తేది: 12-05-2025

బోర్డు ఉత్తర్వుల మేరకు
For Zaggle Prepaid Ocean Services Limited
సం/-
రాజ్ పి నారాయణం
ఎగ్జిక్యూటివ్ చైర్మన్
DIN: 00410032

కొనుగోళ్లు వేగవంతం చేయాలి

దొడ్డు ధాన్యానికీ బోనస్ ఇవ్వాలి : జూలకంటి

ప్రజాశక్తి - హైదరాబాద్‌బ్యూరో

ధాన్యం కొనుగోళ్లను వేగవంతంగా చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వరంగల్ జిల్లా నర్సంపేట వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సిపిఎం నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోళ్లపై ఎదురవుతున్న సమస్యలను పలువురు రైతులు ఏకరువు పెట్టారు. అనంతరం జూలకంటి మాట్లాడుతూ.. ఆరుగాలం కష్టపడి పండించిన రైతుకు మార్కెట్‌లో నిరాదరణ ఎదురవుతుందన్నారు. ప్రభుత్వం, పౌర సరఫరాల శాఖ.. వెనువెంటనే ఎలాంటి ఆటంకాలు ఎదురుకాకుండా ధాన్యం కొనుగోళ్లను చేపట్టడానికి చర్యలు తీసుకోవాలన్నారు. దొడ్డు ధాన్యం పండించిన రైతులకు కూడా రూ.500 బోనస్ చెల్లించాలని కోరారు. మిల్లర్లు తరుగు పేర, తాలు పేరిట క్వింటాకు 8కిలోల చొప్పున తరుగు తీస్తూ రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బస్తాపై 2కిలోలు మాత్రమే తరుగు తీయాలన్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లుల వద్దకు రైతులు కిరాయి వాహనాల ద్వారా ధాన్యం చేరవేస్తున్నారని, ట్రాన్స్‌పోర్టు చార్జీలు చెల్లించడం లేదన్నారు. ధాన్యం డబ్బులు, ట్రాన్స్‌పోర్టు చార్జీలు రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాలతో కల్లాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రైతులకు సరిపడా టార్పాలిన్లు అందించాలన్నారు. రైతులు పండించిన మొత్తం ధాన్యాన్ని షరతులు లేకుండా వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మార్కెట్‌లో మంచినీళ్లు, ఇతర మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం వరంగల్ జిల్లా కార్యదర్శి చింతమల్ల రంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు కొరబోయిన కుమారస్వామి, హన్మకొండ శ్రీధర్, ముంజాల సాయిలు, నాయకులు అక్కాపెల్లి సుధాకర్, గడ్డమీది బాలకృష్ణ, కందికొండ రాజు, దాసరి నరేష్, నర్సింహరాములు తదితరులు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న జూలకంటి

పెండింగ్ సమస్యలను పరిష్కరించండి

- త్రిసభ్య కమిటీకి ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ఉద్యోగుల జెఎసి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. తెలంగాణ ఉద్యోగుల జెఎసి చైర్మెన్ వి.లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన త్రి సభ్య కమిటీ చైర్మెన్ నవీన్‌మిట్టల్, ఇతర సభ్యులను కలిసి సమస్యలపై చర్చించారు. అనంతరం ఆయన చర్చల వివరాలను మీడియాకు వెల్లడించారు. ఈనెల 6న జరిగిన ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలను పరిగణలోకి తీసుకుని ఆమోదించిన తీర్మానాలను మూడు విభాగాలుగా చేసి అత్యవసర, ఆర్థికేతర, ఆర్థిక సమస్యలను అధికారులకు వివరించడం జరిగిందని తెలిపారు. వీటితో పాటు ఉద్యోగులందరికీ నగదు రహిత వైద్యం, పెండింగ్ బిల్లుల విడుదల, నూతన పెన్షన్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరణ, పౌరుల సేవల ఉద్యోగుల కొరకు ప్రత్యేక కార్పొరేషన్ తదితర సమస్యలను పరిష్కరించాలని కమిటీకి నివేదించామని తెలిపారు. 317 జీవో ద్వారా మరి కొన్ని రకాల బదిలీలకు అవకాశం కల్పించాలని, ప్రభుత్వ ఖజానాపై ఆర్థిక భారం పడని 24 అంశాలను తొలుత పరిష్కరించాలని విజ్ఞప్తి చేశామని వివరించారు. ఆర్థిక భారం పడే 14 అంశాలను దశల వారీగా పరిష్కరించాలని కోరినట్టు తెలిపారు. ఉద్యోగుల సమస్యల పట్ల కమిటీ సభ్యులు సానుకూలంగా స్పందించారని, ప్రభుత్వంతో చర్చించి పరిష్కారం కొరకు కృషి చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు కె రామకృష్ణ, దా నిర్మల, ఎస్ రాములు, బాణాల రాంరెడ్డి, రమేష్ పాక, హస్వంతరావు, సిపిఎస్ దర్శన్ గౌడ్, సాల్మన్ నాయక్, శశిధర్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, రవికుమార్, చంద్రశేఖర్ గౌడ్, హరికిషన్, వెంకట్, గోపాల్, హబీబ్ మస్తాన్, లక్ష్మయ్య పూలే, హేమలత, సుగంధిని, తదితరులు పాల్గొన్నారు



త్రి సభ్య కమిటీకి వినతి పత్రం అందజేస్తున్న కమిటీ నాయకులు

కలెక్టర్ హరిప్రియకు వినతి పత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

వైద్య సదుపాయాలు మెరుగుపర్చాలి

- ప్రయివేటు ఆస్పత్రులపై నియంత్రణ పెంచాలి : సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వాస్పత్రుల్లో వైద్య సదుపాయాలను మెరుగుపర్చి, ప్రయివేటు ఆస్పత్రులపై నియంత్రణ పెంచాలని సిపిఎం డిమాండ్ చేసింది. సోమవారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆ పార్టీ నాయకులు నిరసన చేపట్టి.. ప్రజావాణిలో జిల్లా ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) హరిప్రియకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి పి.సత్యం మాట్లాడుతూ.. అల్వాల్ ప్రభుత్వ సూపర్‌స్పెషాల్టీ ఆస్పత్రి నిర్మాణం త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. మేడ్చల్ ప్రభుత్వాస్పత్రి భవన నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని, జమ్మిగడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో షెడ్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వాస్పత్రుల్లో ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. మేడ్చల్, శామిర్‌పేట, ఘట్‌కేసర్ ఆస్పత్రులను వంద పడకల ఆస్పత్రులుగా అప్‌గ్రేడ్ చేయాలని, అందుకు తగినట్టుగా సిబ్బందిని కేటాయించాలని కోరారు. ఆరోగ్యశ్రీ రూ.1100 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వినోద మాట్లాడుతూ.. పిహెచ్‌సి, ఏరియా, బస్తీ దవాఖానాల్లో సరిపడా నర్సులు లేరన్నారు. డెలివరీల కోసం ఆయా ఆస్పత్రుల్లో స్కానింగ్, బెడ్లు లేవన్నారు. సిబ్బంది కొరత ఎక్కువగా ఉందని, ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించాలని కోరారు. లేకపోతే జిల్లా మొత్తం సర్వే చేసి ఆందోళన తీవ్రం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అశోక్, రాజశేఖర్, జిల్లా కమిటీ సభ్యులు నరేష్, శంకర్, సంతోష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అన్నమయ్య సాహితీ సంపద ప్రజలకు చేరువవ్వాలి

ప్రజాశక్తి కల్చరల్

నేడు సమాజం లో విద్రోహ అరాచక శక్తులు నిలయం గా మారుతోందనీ శాంత బయోటెక్ అధినేత డాక్టర్ కె ఐ వర ప్రసాద్ రెడ్డి అన్నారు. ఉత్తమ సంగీతం సాహిత్యం మిళితం గా వున్న అన్నమాచార్య కీర్తనల సాహిత్య సంపద ప్రజలకు చేరువ ఐనప్పుడు ప్రజల్లో మార్పు కు అవకాశం కలుగుతుంది అని ఆయన చెప్పారు అటువంటి కృషి వెంకట్ అన్నమయ్య కీర్తనలు కు వ్యాఖ్యానం యజ్ఞ తుల్యం గా నిర్వహిస్తూ ఇరవై నాలుగు సంపుటి లు వెలువరించి జీవితం ధన్యం చేసుకున్నారు అని ప్రశంసించారు రవీంద్ర భారతి ప్రధాన భారతి ప్రధాన వేదిక పై శ్రీ రామ సాంస్కృతిక సేవా సంస్థ నిర్వహణ లో విఖ్యాత వాగ్గేయ కారులు అన్నమాచార్య జయంతి సందర్భంగా సంకీర్తన ల వ్యాఖ్యాన విశారద వెంకట్ గరికపాటి రచించిన శ్రీ రామాభి రామం, రాజీవ నేత్రాయ ... రాఘవాయ వ్యాఖ్యాన సంపుటి ల ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ వర ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ పదహేనవ శతాబ్ది కాలం నాటి అన్నమయ్య కీర్తనల తెలుగు పదాలలో దాగి వున్న భావాన్ని నేటి వారికి అర్థం అయ్యే రీతిలో వెంకట్ వ్యాఖ్యానం చేస్తూ జీవితం లో సగభాగం ఇందుకే అంకితం చేసారు అని వివరించారు రామాచారి అన్నమయ స్వర రచన కానీ కీర్తనలు స్వర పరచాలని కోరారు.మరో ముఖ్య అతిథిగా పాల్గొన్న భారతీయ స్టేట్ బ్యాంక్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ కిషోర్ కుమార్ సంపుటి లను ఆవిష్కరించి మాట్లాడారు వెంకట్ బ్యాంక్ అధికారిగా ఉంటూ కూడా అన్నమయ్య కీర్తనల పై విశేష పరిశోధన చేస్తూ వ్యాఖ్యాన సంపుటి లను వెలువరిస్తూ వృతి ప్రవృత్తి నీ సమన్వయం చూసుకుంటూ న్యాయం చేస్తున్నారనీ అభిందించారు ఎస్ బి ఐ 1978 లో చేపట్టిన

అన్నమయ్య కీర్తనల ప్రచార ప్రాజెక్ట్ లో రామ చారి వెంకట్ భాగస్వామి గా కొనసాగిస్తున్నారు అని అభినందించారు అధ్యక్షత వహించిన తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరీ శివా రెడ్డి మాట్లాడుతూ వెంకట్ ఇంటి పేరులో వున్న గరిక పచ్చని దని తెలుగు సాహిత్యాన్ని

వ్యాఖ్యానం తో పచ్చ గా నింపుతోంది అని అభివర్ణించారు రాముని పేరు కు నేడు గౌరవం వ్యతిరేకం రెండూ కనిపిస్తున్నది అన్నారు ఐదువేల ఏళ్ళ క్రితం వాల్మికి రాముడు అనే ఉత్తమ పాత్ర సృష్టించారని అన్నమయ్య రాముని కీర్తనలు వెంకట్ వ్యాఖ్యానం చేసి ప్రజలకు అందించారు అని తెలిపారు అనంతరం వెంకట్ ను సంస్థ పక్షాన గొర్తి చంద్ర శేఖర్ నిర్వాహణ లో అన్నమయ్య తత్వ ప్రవచన సుధాకర బిరుదు తో అతిథులు సత్కరించారు ప్రముఖ సంపాదకుడు ఎం వి ఆర్ శాస్త్రి రంగరాజన్ తదితరులు పాల్గొనగా గాయని సందర్భోచిత వ్యాఖ్యానం చేశారు తొలుత ప్రముఖ గాయకుడు రామా చారి తన శిష్య బృందం తో కలసి అన్నమయ్య కీర్తనల గానం చేయగా వెంకట్ సముచిత వ్యాఖ్యానం చేశారు.

నర్సింగ్ ఆఫీసర్లకు మంత్రి దామోదర శుభాకాంక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా నర్సింగ్ ఆఫీసర్లకు వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. కుటుంబ సభ్యుల కంటే ఎక్కువగా నర్సింగ్ ఆఫీసర్లే రోగులకు సేవలు అందిస్తున్నారనీ, కోట్ల మంది పేషెంట్ల ప్రాణాలు కాపాడటంలో కీలక పాత్రను పోషిస్తున్నారని మంత్రి కొనియాడారు. ప్రభుత్వ వైద్య రంగంలో నర్సింగ్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. గతేడాది 6,956 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేశామనీ, మరో 2,322 పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. రెండేళ్లలోనే తొమ్మిది వేలకుపైగా పోస్టులను భర్తీ చేసి, ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న అభ్యర్థులకు ఉద్యోగావకాశాలు కల్పించామని గుర్తుచేశారు. దేశ, విదేశాల్లో నర్సింగ్‌కు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని, 16 ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలను ఇక్కడి యువతకు అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. గ్రామీణ యువతులను నర్సులుగా తీర్చిదిద్ది, దేశ విదేశాల్లో వారికి ఉద్యోగావకాశాలు కల్పించే చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ నర్సింగ్ ఆఫీసర్లకు ప్రమోషన్లు ఇచ్చి, వారి ఆకాంక్షలను నెరవేర్చామని వెల్లడించారు. భవిష్యత్తులోనూ నర్సింగ్ ఆఫీసర్లకు అండగా ఉంటామనీ, వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేందుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ హాస్పిటళ్లకు వచ్చే పేషెంట్లకు సేవలు అందిస్తున్న నర్సులకు మంత్రి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఎంతో మంది నర్సులు పేషెంట్లతో ప్రేమగా మాట్లాడి, వారికి మనో ధైర్యాన్ని కల్పిస్తున్నారని.. అలాంటి నర్సింగ్ ఆఫీసర్లు మిగతా వారు కూడా ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. రోగులు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఒత్తిడి, బాధలో ఉంటారనీ, అలాంటి వారితో ఒక్కమాట ప్రేమగా మాట్లాడితే ఎంతో ఉపశమనం పొందుతారని మంత్రి గుర్తు చేశారు. నర్సింగ్ ఆఫీసర్ల పని ఒత్తిడిని పేషెంట్లు, వారి కుటుంబ సభ్యులు కూడా అర్థం చేసుకుని, వారికి సహకరించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

ఎంపి ఈటల ఇంటి ముట్టడికి యూత్ కాంగ్రెస్ యత్నం

- అరెస్టు చేసిన పోలీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యూత్ కాంగ్రెస్ నాయకులు సోమవారం మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ ఇంటి ముట్టడికి యత్నించారు. అయితే వారిని పోలీసులు అరెస్టు చేసి దుండిగల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఎం రేవంత్‌రెడ్డిపై ఎంపీ ఈటల రాజేందర్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఆయన ఇంటి ముట్టడికి యూత్ కాంగ్రెస్ పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని పూడూరు గ్రామంలో ఉన్న ఎంపి ఈటల రాజేందర్ నివాసం వద్ద సోమవారం ఉదయం నుంచే భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కండ్లకోయ, శామీర్‌పేట్ రెండు వైపుల నుంచి ఈటల రాజేందర్ ఇంటికొచ్చే దారిలో కిలోమీటర్ దూరంలోనే పోలీసులు బారికేడ్లను పెట్టారు. మరోవైపు ఇంటి వరకు యువజన కాంగ్రెస్ నేతలు వస్తే తిప్పికొట్టడానికి బీజేపీ నేతలు పెద్దఎత్తున ఈటల ఇంటికి చేరుకున్నారు. యువజన కాంగ్రెస్ నాయకులు ఈటల ఇంటి వైపు వచ్చి కిలోమీటర్ దూరంలో ఏర్పాటు చేసిన బారికేడ్ల వద్దనే ఎంపి దిష్టిబొమ్మ దహనం చేశారు. పోలీసులు వారిని అడ్డుకొని అరెస్టు చేసి డీసీఎంలో దుండిగల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ నాయకులు ఎంపీ ఈటలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎసిపి శంకర్ రెడ్డి, సిఐ సత్యనారాయణ, ఎస్‌వోటి సిఐ శ్యాంసుందర్, దుండిగల్, సూరారం, మేడ్చల్ పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు, కానిస్టేబుళ్లు, అదనపు బలగాలు బందోబస్తు నిర్వహించారు.

భూ భారతితోనే భూ సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భూ భారతి చట్టంతోనే భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పైలట్ ప్రాజెక్ట్‌గా అమలు చేస్తున్న మద్దూర్, లింగంపేట, వెంకటాపూర్, నెలకొండపల్లి మండలాల్లో అమలు తీరును మంత్రి సమీక్షించారు. సోమవారం ములుగు, కామారెడ్డి, ఖమ్మం, నారాయణపేట జిల్లా కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు. పనిలో అలసత్వం ప్రదర్శించకుండా వచ్చిన దరఖాస్తులను క్షుణంగా పరిశీలించి త్వరితగతిన భూ సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. రైతులు కోర్టుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా రెవెన్యూ కార్యాలయాల్లోనే వారి సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అన్నారు. దరఖాస్తులను తిరస్కరించాల్సి వస్తే లోతుగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. వచ్చిన ఆర్జీలను ఎప్పటికప్పుడు తహశీల్దార్లు ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు.

ఎనిమిది కుటుంబాల సాంఘిక బహిష్కరణ

- ఆలస్యంగా వెలుగులోకి..
- పోలీసులు పట్టించుకోవడం లేదని ఆవేదన
- విడిసిపై కలెక్టర్, సిపికి ఫిర్యాదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలంలోని మిట్టపల్లి గ్రామంలో ఎనిమిది కుటుంబాలను గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు (విడిసి) సాంఘిక బహిష్కరణ చేశారు. ఈ విషయమై బాధితులు సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణితో పాటు సీపీ సాయిచైతన్యకు వేర్వేరుగా వినతిపత్రాలను అందజేశారు. అనంతరం సాంఘిక బహిష్కరణకు గురైన బాధితులు తేలు గణేష్ (మాజీ సర్పంచ్), మాసిపెద్ది శ్రీనివాస్, తేలు గంగాధర్, మాసిపెద్ది రవి, ఒడ్డం నర్సయ్య, గోపు రాజేశ్వర్, చిత్తపేట నడ్పి గంగారాం, గోపు చరణ్ డిచ్‌పల్లి మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. గతేడాది సెప్టెంబర్ 15న గణేష్ నిమజ్జనం సందర్భంగా తంగేళ్ల కిషన్, మాసిపెద్ది శ్రీనివాస్ మధ్య చిన్నపాటి వాగ్వివాదం చోటుచేసుకుంది. అనంతరం మాజీ ఎంపిపి, కాంగ్రెస్ నాయకులు మిట్టపల్లి గ్రామానికి చెందిన కంచెట్టి గంగాధర్ అండతో విడిసి సభ్యులు మున్నూరుకాపు కులానికి సంబంధించిన ఎనిమిది కుటుంబాలను సాంఘిక బహిష్కరణ చేశారు. దాంతో ఆ కుటుంబాల్లో జరిగే శుభ, అశుభ కార్యాలకు గ్రామంలోని ఇతర కులాల వారు హాజరుకావొద్దని, వారికి ఎలాంటి సహకారం అందించవద్దని నిర్ణయించారు. దీనిపై అన్ని కులాల వారికి విడిసి తరపున తీర్మానాన్ని అందజేశారు. 8 మందికి మంగళి షాపులో, చాకలి వారికి ప్రత్యేకంగా తీర్మాన కాపీలను పంపించారని తెలిపారు. దాంతో బాధితులు పది నెలలుగా అనేక ఇబ్బందులు పడుతూ ఈ విషయమై డిచ్‌పల్లి సీఐ కె.మల్లేష్, ఎస్ఐ మోహమ్మద్ షరీఫ్‌ను సంప్రదించినా వారు ఏమాత్రం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సిఐకి ఫిర్యాదు చేస్తే విడిసి సభ్యులను మందలించకుండా బహిష్కరణ చేసిన వారిని 'మీరు ఏయే రాజకీయ పార్టీల్లో ఉన్నారంటూ' ఆరా తీయడం ఏమిటని సీపీ దృష్టికి తెచ్చారు. ప్రశాంతంగా ఉన్న మిట్టపల్లి గ్రామంలో ఓ కాంగ్రెస్ నాయకుడు తమలో తమకు గ్రూపులు చేస్తూ ఇబ్బందులు పెడుతున్నాడని ఆరోపించారు. దాంతో తాము గత్యంతరం లేక ప్రజావాణిలో కలెక్టర్, అలాగే సిపికి తమకు న్యాయం చేయాలని కోరినట్టు బాధితులు తెలిపారు.

కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బాధితులు

ఆర్థిక మంత్రిగా ఈటల రాష్ట్రాన్ని ముంచారు మహేశ్ కుమార్ గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ హయాంలో ఈటల రాజేందర్ ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు తెలంగాణ దివాళా తీసిందని టిపిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. దేవాదాయశాఖ భూముల కబ్జా కేసు ఉన్న విషయం ఎంపీ ఈటల రాజేందర్ మరిచారా? అని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి గురించి మాట్లాడిన తీరు సభ్య సమాజం తలదించుకునేలా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ అయినా ఈటల రాజేందర్ కేసీఆర్ అడుగులకు మడుగులొత్తారన్నారు. కేసీఆర్ హయాంలో చేతగాని, దద్దమ్మ మంత్రిగా ఉన్న ఈటలకు రేవంత్ రెడ్డి గురించి మాట్లాడే నైతిక అర్హత లేదన్నారు. ధనిక రాష్ట్రం తెలంగాణ దివాళా తీయడానికి కారణమైన కెసిఆర్ అలీబాబా చోరీస్‌లో ఈటల రాజేందర్ ఒకరని విమర్శించారు.

ఉపాధి కార్మికులను ఢీకొట్టిన కారు

- ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పొట్ట కూటి కోసం ఉపాధి హామీ పనులకు వెళ్తున్న మహిళా కార్మికులను అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చిన కారు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మహిళలు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈ విషాదకర ఘటన సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట భూంపల్లి మండలం పోతారెడ్డిపేటలో సోమవారం జరిగింది. దుబ్బాక సిఐ పి శ్రీనివాస్, భూంపల్లి ఎస్ఐ హరీష్ గౌడ్, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. పోతారెడ్డిపేట గ్రామానికి చెందిన గోప దేవమ్మ (48) బ్యాగరి చంద్రవ్వ (45), బైండ్ల లాస్య.. రోజువారీ లాగానే సోమవారం ఉదయం ఉపాధి హామీ పనులకు వెళ్లారు. మెదక్‌లో ఓ పెళ్లికి హాజరయ్యేందుకు బెల్లంపల్లి నుంచి బాల్మీకి జ్ఞాన్‌సింగ్, అతని నానమ్మతో కలిసి కారులో వస్తూ రోడ్డుపై నడుచుకు వెళుతున్న ఉపాధి కార్మికులను వేగంగా ఢీకొట్టారు. దాంతో గోప దేవమ్మ , బ్యాగరి చంద్రవ్వ అక్కడికక్కడే మృతిచెందారు. లాస్యకు స్వల్ప గాయాలయ్యాయి. దాంతో ఆగ్రహించిన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు రోడ్డుపై టెంటు వేసి అక్కడే బైటాయించి ఆందోళన చేపట్టారు. మృతుల కుటుంబాలకు న్యాయం జరిగేలా చూస్తామని.. చట్ట ప్రకారంగా చర్యలు తీసుకుంటామని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, దుబ్బాక సీఐ పి.శ్రీనివాస్ చెప్పడంతో వారు ఆందోళన విరమించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం దుబ్బాకలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతులు బ్యాగరి చంద్రవ్వ కుమారుడు కృష్ణ ఫిర్యాదు మేరకు డ్రైవర్ జ్ఞాన్‌సింగ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఘటనా స్థలిని రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య పరిశీలించి.. బాధిత కుటుంబాలను పరామర్శించారు. డిఆర్‌డిఎ పిడి జయదేవ్ ఆర్య, ఆర్‌డిఒ సదానందం మృతుల కుటుంబాలకు ఉపాధి హామీ చట్టం ద్వారా రూ. రెండు లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తామని ప్రకటించారు.

అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు ఏప్రిల్ నెల వేతనమివ్వాలి

- 11 నెలల ఎరియర్స్ చెల్లించాలి : సిఐటియు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు ఏప్రిల్ నెల వేతనాన్ని, మినీ నుంచి మెయిన్ టీచర్లుగా ప్రమోషన్ పొందిన నాలుగు వేల మంది టీచర్లకు 11 నెలల ఎరియర్స్ చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె సునీత, పి జయలక్ష్మి, కోశాధికారి పి మంగ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నాడు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు లేఖ రాశారు. అంగన్‌వాడీ ఉద్యోగులకు ఏప్రిల్ నెల వేతనం నేటికీ చెల్లించని విషయాన్ని ప్రస్తావించారు. 12వ తేదీ దాటినా జీతాలివ్వకపోతే అంగన్‌వాడీ ఉద్యోగుల కుటుంబాలు ఎలా బతుకుతాయని ప్రశ్నించారు. ప్రతి నెలా ఒకటో తేదీనే వేతనాలిచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్చడాన్నీ, ఆ సెంటర్లలో టీచర్లకు సహాయకులను నియమిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. 2024 జనవరి ఒకటో తేదీ నుంచి మినీ నుంచి మెయిన్‌గా అప్‌గ్రేడ్ అయిన అంశాన్ని పరిగణనలోకి తీసుకుని 11 నెలల ఎరియల్స్‌తో ఏప్రిల్ నెల వేతనం చెల్లిస్తే నాలుగు వేల కుటుంబాలకు ప్రభుత్వం మేలు చేసినట్టు అవుతుందని పేర్కొన్నారు.

బిఆర్ఎస్ పాపాలపై మాట్లాడినందుకు కవితకు ధన్యవాదాలు

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ పాపాలపై మాట్లాడినందుకు బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ధన్యవాదాలు తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. భౌగోళిక తెలంగాణ మాత్రమే వచ్చిందే కానీ సామాజిక తెలంగాణ రాలేదని కవిత మాట్లాడారని ఆయన గుర్తుచేశారు. పదేళ్లలో కవిత పదవులు అనుభవించి వేల కోట్ల రూపాయలు దండుకుని నాడు మాట్లాడిన కవిత కనీసం ఇప్పుడైనా మాట్లాడుతున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు. హరీష్‌రావు, కవితను బీఆర్ఎస్ నుంచి బయటకు పంపించాలని కేటీఆర్ ప్రయత్నిస్తున్న నేపథ్యంలో కవిత, రైతు బంధు, సామాజిక తెలంగాణ విషయాలను కవిత మాట్లాడుతోందన్నారు. కవిత జైలుకెళ్లింది లిక్కర్ స్కాం చేసే తప్ప ప్రజల కోసం కాదని ఎద్దేవా చేశారు. కవితను బిఆర్ఎస్‌లో కరివేపాకులా చూస్తున్నారనీ, పార్టీలో ఆమెకు విలువ, గౌరవం లేవని తెలిపారు. కెసిఆర్ చేసిన అప్పులను బయటపెట్టాలని డిమాండ్ చేశారు.

సరిహద్దు ప్రాంతాల నుంచి వస్తున్న తెలంగాణ వాసులు

- కొనసాగుతున్న ప్రభుత్వ సహాయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సరిహద్దు ప్రాంతాల నుండి తిరిగివచ్చిన పౌరులకు తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సహాయం కొనసాగుతున్నది. సిఎం రేవంత్ రెడ్డి ఆదేశంతో న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్ నోడల్ ఆఫీస్‌గా పని చేస్తున్న సంగతి తెలిసిందే. సోమవారం మధ్యాహ్నం వరకు 162 మంది తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. వీరిలో జమ్ముకాశ్మీర్‌లోని వివిధ విద్యాసంస్థల నుంచి 56 మంది, పంజాబ్ రాష్ట్రం నుంచి 106 మంది విద్యార్థులు, ఉద్యోగులు ఉన్నారు. ఇప్పటివరకు 133 మంది తమ స్వగ్రామాలకు బయలుదేరగా, మిగిలినవారికి తెలంగాణ భవన్‌లో తాత్కాలిక వసతి, భోజనం, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో రెసిడెంట్ కమిషనర్ డాక్టర్ గౌరవ్ ఉప్పల్ సోమవారం భవన్ అధికారులతో సమీక్షించారు. అక్కడ ఉన్న విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ "పరిస్థితి నెమ్మదిగా సాధారణమవుతుండటంతో మా విద్యాసంస్థలు తిరిగి క్లా సు లకు హాజరు కావాలని సూచిస్తున్నాయి. అయితే మేము ముందుగా ఇంటికెళ్లి, పరిస్థితి పూర్తిగా సాదారణ స్దితికి చేరుకున్న తర్వాతే మళ్లీ క్యాంపస్‌కు వెళ్లాలనుకుంటున్నాం" అని తెలిపారు. విద్యార్థుల అభ్యర్థన మేరకు, డాక్టర్ గౌరవ్ ఉప్పల్ సంబంధిత యూనివర్సిటీల అధికారులతో మాట్లాడి, విద్యార్థులకు తాత్కాలికంగా ఆన్‌లైన్ తరగతులు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. యూనివర్సిటీలు అందుకు సానుకూలంగా స్పందించాయి. కాగా కొంత మంది ఫైనల్ ఇయర్ విద్యార్థులు పరిస్థితి మెరుగుపడే వరకు ఢిల్లీలోనే వేచి చూసి తిరిగి క్యాంపస్‌లకు వెళ్లాలనుకుంటున్నట్టు తెలపగా వారు తిరిగి వెళ్లేవరకు భవన్‌లో ఉండేదుకు అన్ని వసతులు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన వెల్లడించారు. గడిచిన 24 గంటలుగా సహాయం కోసం చేసే అత్యవసర కాల్స్ గణనీయంగా తగ్గిపోయాయనీ, చాలా తక్కువ మంది విద్యార్థులు మాత్రమే తెలంగాణ భవన్‌కి వచ్చే అవకాశం ఉందని ఆయన తెలిపారు. తెలంగాణ భవన్ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయనీ, ఎవరు సహాయం కోసం వస్తే వారికి అన్ని విధాలా అండగా ఉంటామని డా. గౌరవ్ ఉప్పల్ స్పష్టం చేశారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న గౌరవ్ ఉప్పల్

ఎరుకల ఆత్మగౌరవం కోసమే నాంచారమ్మ జాతరకు వచ్చా

- తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షులు కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎరుకల ఆత్మగౌరవం కోసమే హైదరాబాద్ నుంచి ఇంత దూరం నాంచారమ్మ జాతరకు వచ్చానని, నాంచారమ్మ ఆలయ నిర్మాణానికి సహకరిస్తానని, మరింత రెట్టింపు ఉత్సాహంతో ఉత్సవాలను ప్రతి సంవత్సరం జరుపుకోవాలని తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షులు కల్వకుంట్ల కవిత అన్నారు. సోమవారం ములుగు జిల్లాలోని రామానుజాపూర్ గ్రామపంచాయతీ పరిధి పంట పొలాల మధ్య ఉన్న ఎరుకల నాంచారమ్మ జాతర వైభవంగా ప్రారంభమైంది. తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షులు, నాంచారమ్మ ఉత్సవ కమిటీ చైర్మెన్ లోకిని రాజు ఆధ్వర్యంలో ఎరుకల సంఘం నాయకులు బీఆర్ఎస్ నాయకులు కల్వకుంట్ల కవితకు సాదరంగా స్వాగతం పలికారు. ఇదివరకు చందులాల్, సత్యవతి రాథోడ్ పనిచేసినప్పుడు అందరూ ఈ ఉత్సవాలకు చేయూత అందించారని అన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా సరే కమ్యూనిటీస్ డెవలప్‌మెంట్ ఆగకుండా ప్రభుత్వాలు పనిచేయాలని తెలిపారు. నాంచారమ్మ వేషధారణతో ఉన్న వారితో సోది (ఎరుక) చెప్పించుకున్నారు. అనంతరం అందరితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎరుకల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూతాటి రవికుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ కోనేటి నరసింహ, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీరామ్ ఆనంద్, బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు, మండల అధ్యక్షులు లింగాల రమణారెడ్డి, జాగృతి నాయకులు అంతటి రాము, తదితరులు పాల్గొన్నారు.